

పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

## ప్రశాంతంగా 'గ్రామ పాలన అధికారుల' పరీక్ష

- పరీక్ష కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి

రామగిరి, మే 25: గ్రామ పాలన అధికారుల అర్హత పరీక్ష ఆదివారం నల్లగొండలోని ఎన్జీ కళాశాలలో నిర్వహించారు. పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 276 మంది హాజరు కావాల్సి ఉండగా 241 మంది హాజరయ్యారు. 35 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఇన్చార్జి అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్ తనిఖీ చేశారు. పరీక్ష తీరును చీఫ్ సూపరింటెండెంట్, ఇన్విజిలేటర్లను అడిగి తెలుసుకున్నారు. వారికి సలహాలు, సూచనలు చేశారు. పరీక్ష సజావుగా ముగిసినట్లు అధికారులు ప్రకటించారు. కలెక్టర్ వెంట ఇన్చార్జి అదనపు కలెక్టర్ రాజ్‌కుమార్, తాసీల్దార్ హరిబాబు ఉన్నారు.

## కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలి

ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆధ్వర్యంలో మానవ హారం



నల్లగొండలో మానవహారం చేపట్టిన ముస్లింలు

రామగిరి, మే 25: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు డిమాండ్ చేసింది. బోర్డు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఆదివారం నల్లగొండలోని గడియారం సెంటర్‌తోపాటు పలు ప్రాంతాల్లో ముస్లింలు మానవ హారం ఏర్పాటు చేసి నిరసన తెలిపారు. వక్ఫ్ బచావో, దస్తూర్ బచావో, హిందూ -ముస్లిం భాయ్ భాయ్, భారత్ జిందాబాద్ అంటూ జాతీయ జెండాలు చేతబూని నినాదాలు చేశారు. కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ చట్టాన్ని వెనక్కి తీసుకొని ముస్లింల ఆత్మగౌరం కాపాడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, ప్రముఖులు, వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ముస్లింలు పాల్గొన్నారు.

## జూన్ 22 నుంచి కేవీపీఎస్ జిల్లాస్థాయి శిక్షణ తరగతులు

- సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నాగార్జున



సమావేశంలో మాట్లాడుతున్న పాలడుగు నాగార్జున

నకిరేకల్, మే 25 : జూన్ 22, 23 తేదీల్లో కట్టంగూర్‌లో కేవీపీఎస్ జిల్లా స్థాయి శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున తెలిపారు. ఆదివారం నకిరేకల్ పట్టణంలోని నర్రా రాఘవరెడ్డి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శిక్షణ తరగతులకు జిల్లా వ్యాప్తంగా 200 మంది ప్రతినిధులు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వంటెపాక కృష్ణ, చిలుముల రామస్వామి, కేతేపల్లి వెంకన్న, మద్రి వెంకటయ్య పాల్గొన్నారు.



ఎమ్మెల్యే వేముల వీరేశానికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు, వ్యాపారులు

## చిట్యాలలో అదనపు అండర్‌పాస్‌ల కోసం వినతి

చిట్యాల, మే 25 : చిట్యాలలో జాతీయ రహదారిపై నిర్మిస్తున్న ఫ్లైఓవర్ బ్రిడ్జిపై పోలీస్‌స్టేషన్ సమీపంలో వచ్చే అండర్ పాస్‌తో పాటు బస్టాండ్ సమీపంలో, వనిపాకల రోడ్డు వద్ద మరో రెండు అండర్‌పాస్‌లు ఏర్పాటు చేయాలని కోరుతూ బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు ఆదివారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి విన్నవించారు. హైదరాబాద్‌లో కేంద్ర మంత్రిని కలిసి ఈ మేరకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు గుండాల నరేశ్, మాస శ్రీనివాస్, రుద్రవరం లింగస్వామి, కందాటి చంద్రారెడ్డి, ముక్కామల పరమేశ్, ఆగు అశోక్, గంజి శ్రీరామ్, వెంకన్న, గడ్డం గోవర్ధన్ పాల్గొన్నారు.

**ఎమ్మెల్యేకు వినతి**

చిట్యాలలో మరో రెండు అండర్‌పాస్‌లు ఏర్పాటు చేయాలని కోరుతూ అఖిలపక్ష నాయకులు, వ్యాపారులు ఆదివారం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశానికి వినతిపత్రం అందించారు.

## ఆర్టీసీ బస్సులో మంటలు

- డ్రైవర్ అప్రమత్తతతో ప్రయాణికులకు తప్పిన ప్రమాదం

నల్లగొండ సిటీ, మే 25: నల్లగొండ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఇంజిన్‌లో ఆదివారం ఆకస్మికంగా మంటలు చెలరేగాయి. డ్రైవర్ అప్రమత్తతతో ప్రయాణికులు ప్రమాదం నుంచి బయటపడ్డారు. నల్లగొండ డిపోకు చెందిన ఆర్టీసీ పల్లెవెలుగు బస్సు బస్టాండ్ నుంచి దిల్‌సుఖ్‌నగర్‌కు ప్రయాణికులతో బయల్దేరింది. జిల్లా కోర్టు దాటిన తర్వాత బస్సు ఇంజిన్‌లో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు రావడం గమనించిన డ్రైవర్ వెంటనే అప్రమత్తమై బస్సును నిలిపివేసి ప్రయాణికులకు కిందికి దింపాడు. బస్సులో ఉన్న ఫైర్ సేఫ్టీ యంత్రంతో మంటలు ఆర్పివేయడంతో ప్రమాదం తప్పింది. ప్రయాణికులను మరో బస్సులో ఎక్కించి హైదరాబాద్‌కు పంపించినట్లు బస్సు డ్రైవర్, కండక్టర్ చెప్పారు. వర్షం కారణంగా ఇంజిన్‌లో షార్ట్ సర్క్యూట్‌తో పొగలు వస్తుండడంతో వెంటనే బస్సును నిలిపివేసి మంటలను ఆర్పినట్లు బస్సు డ్రైవర్ తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

**PLOT FOR SALE**
★సాగర్ హైవే, విజయవాడ హైవేలలో తక్కువ ధరలో అపార్ట్‌మెంట్ ప్లాట్లు, Indp. ప్లాట్లు & ఓపెన్ ప్లాట్లు HMDA/DTCP అప్రూవల్ LRS గల ప్లాట్లు కలవు. 9603444402.
NT-331100

**PLOT FOR SALE**
★సాగర్ రోడ్‌లోగల రెయిన్‌బో వెంచర్ ఫేస్-2 నందు 300 చ॥గల తూర్పు ఫేస్ ప్లాట్ అమ్మబడును. గజం: 5,500/- రూ.లు. సంప్ర॥ 9885650635, 6281714883.
NT-329532

**గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/- ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
నమస్తే తెలంగాణ
నల్లగొండ: 9182777625, 9182777635
దేవరకొండ: 9182777635
హాలియా: 9182777059
మిర్యాలగూడ: 9182777059

## అధ్వానంగా చెర్వు అన్నారం రోడ్డు

- తారు, కంకర పోయి గుంతలు ఏర్పడిన వైనం
- ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు



చెర్వుఅన్నారం సమీపంలో పూర్తిగా ధ్వంసమైన రోడ్డు

కట్టంగూర్, మే 25 : మండలంలోని అయిటిపాముల నుంచి చెర్వుఅన్నారం గ్రామానికి వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చాలా ఏండ్ల క్రితం నిర్మించిన రోడ్డుపై తారు, కంకర లేచిపోయి గుంతలు ఏర్పడ్డాయి. అయిటిపాముల గ్రామశివారు నుంచి అన్నారం వరకు రోడ్డంతా శిథిలమైంది. సింగిల్ రోడ్డు కావడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్డును బాగుచేయాలని అనేక మార్లు విన్నవించినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నకిరేకల్ మండలం కడపర్తి గ్రామ సమీపంలో ఉన్న క్రషర్ మిల్లు నుంచి కంకర లారీలు, ట్రాక్టర్లు, భారీ వాహనాలు ఈ రోడ్డు గుండానే వెళ్తుండడంతో రోడ్డు పూర్తిగా ధ్వంసమైందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రాత్రి సమయంతో ఈ మార్గంగుండా వెళ్లాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వెళ్లాల్సి వస్తుందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. వర్షం వస్తే పరిస్థితి మరీ ప్రమాదకరంగా మారుతుందని, సంబంధిత అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## ఖాసీం కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి పరామర్శ

నకిరేకల్, మే 25 : నకిరేకల్ పట్టణానికి చెందిన ముస్లిం మత పెద్ద ఖాసీం ఆదివారం తెల్లవారు జామున గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య వారి ఇంటికి వెళ్లి ఖాసీం మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మున్సిపల్ మాజీ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్, కౌన్సిలర్ పల్లె విజయ్, మాజీ ఎంపీటీసీ గుర్రం గణేశ్, నాయకులు పెండెం సదానందం, దైద పరమేశ్, మోయిజ్, ఎండీ జాఫర్, రాచకొండ శ్రవణ్, అఖిల్, చిట్యాల అశోక్ ఉన్నారు.

## నేటి నుంచి టీపీఎస్‌వీ ప్రచార జాతా

రామగిరి, మే 25: ప్రభుత్వ పాఠశాలలను ప్రజలే కాపాడుకోవాలనే నినాదంతో తెలంగాణ పౌర స్పందన వేదిక రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం నుంచి ప్రచార జాతాను నిర్వహిస్తున్నట్లు వేదిక జిల్లా అధ్యక్షుడు పాల్వాయి అంజిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నల్లగొండలో జాతాను మాజీ ఎమ్మెల్సీ అల్గుబెల్లి నర్సిరెడ్డి ప్రారంభిస్తారని పేర్కొన్నారు. నల్లగొండ, మహబూబ్ నగర్ , రంగారెడ్డి జిల్లాలో జాతా కొనసాగుతుందని వెల్లడించారు. తొలి రోజు నల్లగొండ, నకిరేకల్, సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, నేరేడుచర్ల, మిర్యాలగూడలో ఉంటున్నదని పేర్కొన్నారు. 27న హాలియా, కొండమల్లేపల్లి, దేవరకొండ, కల్వకుర్తి, నాగర్‌కర్నూల్‌లో ప్రజార జాతా కొనసాగుతుందని తెలిపారు.

## అలకాపురికాలనీ కమిటీ ఎన్నిక

రామగిరి, మే 25: నల్లగొండలోని కలెక్టరేట్ సమీపంలోని అలకాపురి కాలనీ కార్యవర్గ ఎన్నికను ఆదివారం నిర్వహించారు. అధ్యక్షుడిగా వల్లపురెడ్డి కోటిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా హరినారాయణ, ప్రధాన కార్యదర్శిగా లక్ష్మయ్య, కోశాధికారిగా బ్రాహ్మణాచారి, సహకార్యదర్శిగా అద్దంకి వెంకటేశ్వర్లులతో పాటు సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు.

## పార్టీ బలోపేతానికి కృషి చేయాలి : సీపీఐ

భూదాన్ పోచంపల్లి, మే 25 : పార్టీ పటిష్టత కోసం నాయకులు, కార్యకర్తలందరూ కృషి చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఇంద్రియాల గ్రామంలో ఆదివారం జరిగిన సీపీఐ మండల కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ శాఖల మహాసభలు నిర్వహించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బోడ సుదర్శన్, మండల కార్యదర్శి గోడల నాగభూషణ్, కల్లు గీత సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పబ్బు యాదయ్య పాల్గొన్నారు.



మునుగోడు : ఆర్థిక సాయం అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## నరసింహ కుటుంబానికి పాల్వాయి స్రవంతి ఆర్థిక సాయం

మునుగోడు, మే 25 : మండల కేంద్రానికి చెందిన పందుల నరసింహ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు పాల్వాయి స్రవంతి నరసింహ కుటుంబానికి రూ.10వేలు ఆర్థికసాయాన్ని పంపించారు. వాటిని బీఆర్ఎస్ నాయకులు ఆదివారం మృతుడి కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో పాల్వాయి వెంకట్‌రెడ్డి, మారగోని అంజయ్యగౌడ్, మేకల శ్రీనివాస్‌రెడ్డి, అయితగోని విజయ్‌గౌడ్, సాధు రాము, పందుల సురేశ్, పందుల పాపయ్య, మార్త మోహన్‌రెడ్డి, గజ్జల బాలరాజు మల్లేశ్ పాల్గొన్నారు.

నకిరేకల్ : మండలంలోని మంగళపల్లి గ్రామానికి చెందిన కందికంటి శ్రీనివాస్ ఇటీవల మృతి చెందాడు. నిరుపేద కుటుంబం కావడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్లు తెలుసుకున్న బీజీఆర్ ఫౌండేషన్ చైర్మన్ బచ్చుపల్లి గంగాధర్‌రావు ఆదివారం కుటుంబ సభ్యులకు రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట పీఏసీఎస్ డైరెక్టర్ గొడ్డేటి సైదులు, మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్, నాయకులు ఉన్నారు.

**అంగన్‌వాడీ ఆయా కుటుంబానికి..**

కట్టంగూర్ : మండలంలోని ఎరసానిగూడెం అంగన్‌వాడీ కేంద్రం ఆయా బండారు యాదమ్మ అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఐసీడీఎస్ నకిరేకల్ ప్రాజెక్టు సీడీపీఓ అస్రమ్ అంజుమ్, అంగన్‌వాడీ టీచర్లు గ్రామానికి వెళ్లి యాదమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు రూ.10వేల ఆర్థికసాయం అందించారు. వారి వెంట అంగన్‌వాడీ టీచర్లు రామలింగమ్మ, మంగమ్మ, నవనీత ఉన్నారు.

## దుర్గాప్రసాద్‌కు గౌరవ డాక్టరేట్



గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న దుర్గాప్రసాద్

మిర్యాలగూడటౌన్, మే 25: మిర్యాలగూడ పట్టణానికి చెందిన కత్తురోజు దుర్గాప్రసాద్‌కు సౌత్ వెస్టన్ అమెరికన్ విశ్వవిద్యాలయం వారు గౌరవ డాక్టరేట్‌ను అందించారు. శనివారం గ్లోబల్ అచీవర్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో జరిగిన రాష్ట్రీయ గౌరవ ఐకాన్ అవార్డ్స్ 2025 కార్యక్రమంలో దుర్గాప్రసాద్‌కు డాక్టరేట్‌ను అందించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో విద్య, వైద్యం, రాజకీయ, సామాజిక సేవా రంగాల్లో ఆయన చేసిన సేవలను గుర్తించి డాక్టరేట్‌ను అందించారు.



శ్రీనివాస్‌కు ఆర్థిక సాయం అందిస్తున్న పద్మశాలి సంఘం నాయకులు

## పవర్‌లూమ్ కార్మికుడికి చేయూత

నల్లగొండ రూరల్, మే 25: నల్లగొండ పట్టణంలోని పద్మనగర్‌కు చెందిన పవర్‌లూమ్ కార్మికుడు మిర్యాల శ్రీనివాస్ కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాడు. విషయం తెలుసుకున్న పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు పొట్టబత్తుల సత్యనారాయణ ఆదివారం అతడి ఇంటికి వెళ్లి రూ.10వేలను అందించారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి కర్నాటి యాదగిరి, గంజి రామలింగం, దుడుకు లక్ష్మీనారాయణ, గంజి మురళి, పున్న రమేశ్, చంద్రశేఖర్, మూడ వేణు పాల్గొన్నారు.

## డీజిల్ లేక ఆగిపోయిన చెత్త సేకరణ ట్రాక్టర్



గ్రామపంచాయతీ కార్యాలయంలో నిరుపయోగంగా ఉన్న చెత్త సేకరణ ట్రాక్టర్

ఆత్మకూరు(ఎం), మే 25 : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పల్లె ప్రగతిలో భాగంగా ప్రతి గ్రామంలో చెత్త సేకరణ చేసేందుకు ట్రాక్టర్లను కొనుగోలు చేశారు. దాంతో నాడు ప్రతి గ్రామం పరిశుభ్రంగా మారింది. నేడు కాంగ్రెస్ పాలనలో ఆత్మకూరు(ఎం) గ్రామపంచాయతీ కార్యాలయం ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన చెత్త సేకరణ ట్రాక్టర్ డీజిల్ లేకపోవడంతో వారం రోజుల నుంచి ట్రాక్టర్ నిలిచిపోయింది. చెత్త సేకరణ కోసం ట్రాక్టర్ ఇంటింటికీ రాకపోవడంతో ఇండ్లల్లోని తడి, పొడి చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తుంది. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి చెత్త సేకరణ ట్రాక్టర్‌ను వినియోగంలోకి తేవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## 'విశ్వకర్మలు రాజకీయాల్లో రాణించాలి'



వెంకటేశ్వరాచారికి అవార్డు అందజేస్తున్న పుష్పగిరి

రామన్నపేట, మే 25 : విశ్వకర్మలు రాజకీయాల్లో రాణించాలని విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ వ్యవస్థాపకుడు విశ్వనాథుల పుష్పగిరి చారి అన్నారు. నాయకత్వ లక్షణాలు కలిగి ఉండి రాజకీయాల్లో రాణిస్తున్న విశ్వకర్మలను బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా మండల కేంద్రానికి చెందిన మాజీ ఎంపీటీసీ, పీఏసీఎస్ డైరెక్టర్ కన్నెకంటి వెంకటేశ్వరాచారిని సన్మానించి లీడర్స్ అవార్డు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో విశ్వకర్మలు ప్రాతినిధ్యం వహించాలని, విశ్వకర్మ కార్పొరేషన్ సాధించుకోవాలని పిలుపునిచ్చారు.

## రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలని నిరసన



రోడ్డుపై నిరసన తెలుపుతున్న ఇంద్రియాల గ్రామస్తులు

భూదాన్ పోచంపల్లి, మే 25 : మండలంలోని ఇంద్రియాల నుంచి రేవణపల్లి వరకు రోడ్డు గుంతలమయంగా మారిందని, రోడ్డు మరమ్మతు పనులను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఇంద్రియాలలో నాయకులు, గ్రామస్తులు ఆదివారం నిరసన తెలిపారు. గుంతలమయమైన రోడ్డుతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతూ ప్రమాదాల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతు పనులను వెంటనే చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు, మాజీ సర్పంచ్ బండి కృష్ణ, మాజీ ఎంపీటీసీలు మొగిలిపాక యాదగిరి, మొగిలిపాక సంతోష్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ నోముల మాధవరెడ్డి, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు పెద్దిరెడ్డి యాదగిరి, నాయకులు గరిసె జంగయ్య, ఎర్ర చిన్న శంకరయ్య, చింతల రామకృష్ణ, ఎర్ర విక్రమ్, మొగిలిపాక శ్రీనివాస్, కుమ్మరి బుచ్చిబాబు, బోయిని కనకయ్య, పెద్దిరెడ్డి చంద్రయ్య పాల్గొన్నారు.

## '27న జరిగే నిరాహార దీక్షను జయప్రదం చేయాలి'

వలిగొండ, మే 25 : తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఈ నెల 27న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టనున్న నిరాహార దీక్షను జయప్రదం చేయాలని టీజేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంగిశెట్టి క్రిష్టఫర్ కోరారు. మండల కేంద్రంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంలో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఉద్యమకారులకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక మర్చిపోయిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను జూన్ 2లోపు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఇందిరాపార్కులో నిర్వహించే ధర్నాకు తెలంగాణ ఉద్యమకారులు తరలి రావాలని పిలుపునిచ్చారు.

## 'ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి యాదగిరి కృషి'



పీఆర్‌టీయూ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు యాదగిరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సంఘ నాయకులు

హాలియా, మే 25 : పీఆర్‌టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు సామల యాదగిరి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చేసిన కృషి ఎనలేనిదని ఆ సంఘం నాయకులు అన్నారు. యాదగిరి 23వ వర్ధంతిని ఆదివారం హాలియాలో నిర్వహించారు. ఈ సందర్భంగా సామల యాదగిరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం యాదగిరి పీఆర్‌టీయూ సంఘాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మందా సైదులు రావుగౌతమ్, నాయకులు చెన్ను వెంకట్‌రెడ్డి, పరశురాం, నారాయణదాస్ దుర్గాప్రసాద్, కుంచం హర్షవర్ధన్, జైపాల్‌రెడ్డి, వెంకన్న యాదవ్ పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మునుగోడు: ఆనాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

మునుగోడు, మే 25 : మండల కేంద్రంలోని ఎస్ఎస్ఆర్ హైస్కూల్‌లో 2005-2006 టెన్త్ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.19 సంవత్సరాల తర్వాత కలుసుకున్న స్నేహితులు తాము చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాదగోని భిక్షంగౌడ్, చంద్రమౌళిగౌడ్, వినోద, శివ, లూథర్ రాజు, రషీద్, ఉస్మాన్, మహేశ్, వెంకటేశ్వర్లు, పూర్వ విద్యార్థులు కేశనబోయిన మల్లేశ్, చందపాక నాగరాజు, మక్సూద్, బండారు భాస్కర్, శేఖర్, వెంకటేశ్, విజయ్, గణేశ్, సుష్మ, మంజుల, లలిత, శ్రావణి, బాలమణి, రాధ, ధనమ్మ, జ్యోతి, పృధ్వి, ధనలక్ష్మి పాల్గొన్నారు.

**మాదారం కలాన్ గ్రామంలో..**

శాలిగౌరారం : మండలంలోని మాదారం కలాన్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1996-97బ్యాచ్ పదోతరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమకు చదువు చెప్పిన గురువులను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు నల్లగొండ ఆర్డీఓ అశోక్‌రెడ్డి, అనంతుల సత్యనారాయణ గౌడ్, పుట్టబత్తుల పార్థసారథి, వేముల సైదులు తదితరులు పాల్గొన్నారు.

**నవోదయ ఉన్నత పాఠశాలలో..**

గుర్రంపోడు : మండల కేంద్రంలోని నవోదయ ఉన్నత పాఠశాలలో 2009-10 టెన్త్ బ్యాచ్, గుర్రంపోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1995-1996 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఎస్ఐ పసుపులేటి మధు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తమకు చదువు చెప్పిన గురువులను పూర్వ విద్యార్థులు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ వద్దిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు వద్దిరెడ్డి నరసింహారెడ్డి, రావుల వెంకటనారాయణ గౌడ్, పన్నాల గోపాల్, మల్లేశం, పూర్వ విద్యార్థులు వెంకట్‌రెడ్డి, రేపాక కోటేశ్, శివరాజ్, జగపతిబాబు, గాసీరాం, జానిపాషా, కంచర్ల భవాని, రాజేశ్వరి, దామ కవిత, రాధిక, జడ్పీహెచ్ఎస్‌లో అప్పటి ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ రెడ్డి, ఉపాధ్యాయులు ఎండీ రషీద్, ఏలూరి అశోక్‌కుమార్‌రావు, ఏలూరి విజయలక్ష్మి, వద్దిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

**నక్కలపల్లి జడ్పీహెచ్ఎస్‌లో..**

నార్కట్‌పల్లి : మండలంలోని నక్కలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2012-13 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమకు చదువు చెప్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో అప్పటి ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



నార్కట్‌పల్లి :సమ్మేళనంలో పాల్గొన్న నక్కలపల్లి జడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థులు



గుర్రంపోడ్ : ఉపాధ్యాయులతో నవోదయ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు



శాలిగౌరారం: మాదారంలో ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు



గుర్రంపోడ్: సమ్మేళనంలో పాల్గొన్న జడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థులు

## తాటి చెట్టు పైనుంచి జారి పడి గీత కార్మికుడు మృతి

చౌటుప్పల్, మే 25 : ప్రమాదవశాత్తు తాటి చెట్టు పైనుంచి జారి పడి గీత కార్మికుడు మృతిచెందాడు. ఈ సంఘటన చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి గ్రామంలో ఆదివారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. తంగడపల్లి గ్రామానికి చెందిన చెరుకు సత్తయ్య గౌడ్ (54) ఆదివారం కల్లు గీసేందుకు తాటి చెట్టు ఎక్కి దిగుతుండగా ప్రమాదవశాత్తు మోకు జారి కిందపడ్డాడు. దాంతో తీవ్రంగా గాయపడ్డాడు. సమీప వ్యక్తులు గమనించి వ్యక్తులు స్థానిక ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు దవాఖానకు తీసుకెళ్లారు. అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

## సబ్సిడీపై విత్తనాలు అందించాలి

మోత్కూరు, మే 25 : వానకాలం సీజన్ ప్రారంభమైనందున రైతులకు విత్తనాలు, ఎరువులు సబ్సిడీపై అందించాలని రైతు సంఘం మండల కార్యదర్శి దడిపెల్లి ప్రభాకర్ అన్నారు. ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రైతులకు నకిలీ విత్తనాలను విక్రయించే షాపులపై వ్యవసాయాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.